క్లుప్తంగా

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



సబ్బవరం గ్రంథాలయానికి అందుబాటులోకి వచ్చిన పలు పుస్తకాలు

సబ్బవరం: వివిధ పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా ఉండే పుస్తకాలు సబ్బవరం శాఖా గ్రంథాలయంలోఅందుబాటులోకి వచ్చాయి. వాటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి పీవీ రమణ కోరారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పాఠకులకు అవసరమయ్యే పుస్తకాలు కావాలని అధికారులు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులను కోరారు. ఆ మేరకు వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే 41 పుస్తకాలు పంపినట్టు గ్రంథాలయ అధికారి రమణ తెలిపారు.

40 మందికి క్యాంపస్ కొలువులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

సింహాచలం: పెందుర్తి మండలం పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. పలు కంపెనీలు సంయుక్తంగా ఈ ఇంటర్వ్యూలను సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించి నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోషువా, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఇ.కిరణ్‌కుమార్ అభినందించారు.

ఉపాధి పనులు ప్రారంభం



వెన్నలపాలెంలో ఉపాధి పనులు ప్రారంభించిన సర్పంచ్ అప్పారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో దుర్గాలమ్మ గుడి వద్ద రూ.9.7లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ పనులను సర్పంచ్ వెన్నల అప్పారావు సోమవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులను చెరువులో పూడికలు తొలగించడానికి ఉపయోగించనున్నట్టు చెప్పారు. పూడిక తొలగింపు పనుల్లో సుమారు 70 మంది కూలీలకు ఉపాధి లభిస్తుందని సర్పంచ్ అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, మాసవరపు పార్వతీముత్యాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

సబ్బవరం:పెరిగిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని టీడీపీ నాయకులు సోమవారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇష్టానుసారంగా చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మహలక్ష్మినాయుడు, నాయకులు భరిణికాన బాబూరావు,గండి దేముడు,గండి ముత్యాలనాయుడు,గవర అప్పారావు,రేసుపూడి రమణ,దెడ్డం ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. ఈ మెయిల్ ఐడీ endow&eokanaka@gov.in ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

జగన్ పాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు

- గత టీడీపీ పాలన అంతా అవినీతిమయం
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అడవివరం ఎస్సీకాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కొలుసు ఈశ్వరరావు తదితరులు



ప్రహ్లాదపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో అవినీతి, వివక్ష పాలన సాగిస్తే.. తమ ప్రభుత్వం కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పరిపాలన సాగిస్తోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదించిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటి టీడీపీ ప్రభుత్వం పాలన అంతా అవినీతిమయమే అన్నారు. ప్రజలెవరికీ సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఉందన్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరూ అనుకోరంటూ చంద్రబాబు ఎస్సీలను చిన్నచూపు చూశారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్ద పీట వేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ నాడు-నేడు, అమ్మ ఒడి, వసతిదీవెన, విద్యా దీవెన, విద్యా కానుక తదితర సంక్షేమ పథకాలతో చదువుకు అవకాశం కల్పించారని చెప్పారు. రికార్డు స్థాయిలో 17 కొత్త మెడికల్ కళాశాలలు తెచ్చారన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

గత ప్రభుత్వంలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోతే జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాకా అక్కచెల్లమ్మలకు 32 లక్షల ఇళ్ల పట్టాలు అందించారన్నారు. కార్యక్రమంలో 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, నాయకులు సూరిబాబు, వినోద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాగా ప్రహ్లాదపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి పార్టీ నేత దాసరి సత్తిబాబు రూ.5 వేల నగదును ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా అందజేశారు.

పలు వార్డుల్లో..

- జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరం ఎస్సీకాలనీలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు పీతల అప్పలరాజు, నాయకులు ఆదిరెడ్డి, ధర్మా, గురునాథ్, రమణ, నాగరాజు, మహేష్, సచివాలయ కన్వీనర్ శివ పాల్గొన్నారు.
- జీవీఎంసీ 95వవార్డు వేపగుంట ఎస్సీబీసీ కాలనీలో కార్పొరేటర్ ముమ్మన దేముడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జల్లుబాబు, కిరణ్‌కుమార్, నర్సింగ్, హరి, రామారావు, దేముడుబాబు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 93వవార్డు పరిధి గొల్లనారాయణపురంలో సోమవారం వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు జగనన్నే మా భవిష్యత్తు... మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు కనకరాజు, శ్రీను, వార్డ్, గృహ సారథులు లక్ష్మి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులను .. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వంచించిన విధానాన్ని వివరించారు. పైడివాడ గ్రామంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయం తీసుకుని వారి ఆమోదంతో స్టిక్కర్లు అంటించారు.

- పైడివాడ అగ్రహారంలో సచివాలయ కన్వీనర్ పెచ్చేటి రమేష్ నాయుడు , తదితరులు ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంట నడవాలని కోరారు.
- మొగలిపురంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఐడీ బాబు పార్టీ శ్రేణులు,గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.



తాడిలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా



లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చిన్నారావు

పరవాడ మండలంలో..

పరవాడ: తాడి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా వార్డు కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

- కలపాకలో సర్పంచ్ బొండా కనకారావు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజలకు వివరించారు. నాయకులు మరిశ శ్రీనివాసరావు, ఇందల రామారావు, కన్వీనర్లు గుడివాడ సాయి, శ్రీను పాల్గొన్నారు.
- భర్నికంలో సర్పంచ్ పెదిశెట్టి పూజశేఖర్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు.
- ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సంక్షేమ పథకాల అమలు తీరు తెన్నులను తెలుసుకొని ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు.

కోఆపరేటివ్ సొసైటీలో అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎన్ఏడీ సీఈ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం అవినీతికి పాల్పడుతోందని సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు మల్లికార్జునకు ఎన్ఏడీ సీఈ యూనియన్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్ యార్డు ఐఎన్‌సీఈ కోఆపరేటివ్ పాలకవర్గం చేసిన ఖర్చు కంటే సుమారు రూ. 63 లక్షలు ఎక్కువ ఖర్చు చేసిందని ఆరోపించారు. ఎన్ఏడీ సొసైటీలో 925 మంది మాత్రమే ఉన్నారని.. డాక్ యార్డు సొసైటీలో 7225 మంది సభ్యులున్నారని తెలిపారు. అవినీతి కారకుడైన సొసైటీ కార్యదర్శితో పాటు పాలక మండలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు.

హైవేలో రెండు రోడ్డు ప్రమాదాలు



స్కూటీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని జాతీయ రహదారిపై సోమవారం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. శాంతిపురం రహదారిపై ఓ కారును అతివేగంగా వచ్చి స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు సైడ్ భాగం దెబ్బతింది. స్కూటీతో ఢీకొట్టిన యువకుడి కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మరో ఘటనలో కారును లారీ ఢీకొట్టడంతో కారు వెనుక భాగం నుజ్జునుజ్జయింది.

ఎల్ఐసీ ఏవోఐ మహాసభ లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ ఏవోఐ ఆహ్వాన కమిటీ

డాబాగార్డెన్స్: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనేజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏవోఐ) అఖిల భారత జాతీయ 6వ మహాసభలు ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న మహాసభల లోగోను జగదాంబ జంక్షన్ సమీపానగల సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల చైర్మన్ సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఎల్ఐసీని కాపాడుకోవడం.. ఏజెంట్లను రక్షించుకోవాలన్న నినాదంతో 2003లో సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి లక్ష్యం కోసం పోరాడుతున్న ఏకైక జాతీయ స్థాయి ట్రేడ్ యూనియన్ అని పేర్కొన్నారు. మహాసభకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. మహాసభల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాలు రూపొందించడం జరుగుతుందని చెప్పారు. వంద మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్, జోనల్ సెక్రటరీ పి.ఎల్. నరసింహారావు, విశాఖ డివిజన్ సెక్రటరీ ఎస్.ఆర్. ఠాగూర్, సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

మహారాణిపేట: సరకుల ధరలు పెరిగినందువల్ల మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగ్రీ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ ధర విపరీతంగా పెరిగిపోయిందని, సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో మెనూ చార్జీలు కూడ పెంచాలని కోరారు. ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.రాము, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి రాజాబాబు కృషి అభినందనీయం




సమావేశంలో మాట్లాడుతున్న పితాని ప్రసాద్

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ మాజీ కమిషనర్ రాజాబాబు నగరాభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని ఏపీ బీసీ స్టడీ సర్కిల్స్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. రాజాబాబు పనితీరుపై కొందరు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర బీసీ సంఘం, ఏయూ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా తక్కువ సమయం జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న రాజాబాబు అనేక ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సదస్సులను విజయవంతంగా నిర్వహించడంలో సఫలీకృతమయ్యారన్నారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి ప్రణాళికలను విజయవంతంగా అమలు చేశారన్నారు. తద్వారా నగరానికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు తెచ్చారని చెప్పారు. బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ మాట్లాడుతూ రాజాబాబుపై కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. చాలా తక్కువ సమయంలో రూ.400 కోట్లు వరకు యంత్రాంగం ద్వారా పన్నులు వసూళ్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఎస్.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కాగితాల రామారావు, కండిపిల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన విస్తృతికి ఐఎస్‌టీడీ కృషి

- వైజాగ్ చాప్టర్ చైర్మన్ రావ్
- ఘనంగా సంస్థ 53వ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ రావ్

మురళీనగర్: జ్ఞానవిస్తృతిని పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ పనిచేస్తోందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓఎం రావ్ తెలిపారు. ఐఎస్‌టీడీ 53వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకరటమణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 52 చాప్టర్లు ఉన్నాయని, వైజాగ్ చాప్టర్‌లో వివిధ సాంకేతిక విభాగాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన 600 మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్టూడెంట్ చాప్టర్ల ద్వారా వీరు విద్యార్థులకు వారి సబ్జెక్టుతోపాటు నైపుణ్యాల సాధనకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందిస్తారని వివరించారు. ఒకరికొకరు పరిచయం చేసుకోవడం ద్వారా నాలెడ్జ్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ సులువవుతుందన్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మారుతున్న సాంకేతిక విధానాలకు అవసరమైన జ్ఞాన సముపార్జన ఉండాలన్నారు. ఈ చాప్టర్ల ద్వారా నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు డాక్టర్ రావ్ సూచించారు. వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కెమికల్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామిని బిల్వపత్రాలతో పూజించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఆర్టీసీ బస్సులో మేయర్ ప్రయాణం



బస్సు దిగి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోకి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సులో సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ఆర్టీసీ బస్సుల్లో రావాలని ఆదేశించారు.

మర్రిపాలెం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్ దగ్గర సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వివరాలిలా.. సుమారు 30-35 ఏళ్ల వ్యక్తి మర్రిపాలెం స్టేషన్ సమీపంలో సోమవారం కరెంటు షాక్ వల్ల చనిపోయాడు. ఈ వ్యక్తి ఏదైనా గూడ్స్ రైలుపై నుంచి విద్యుత్ వైర్లను పట్టుకోవడం వల్ల, కరెంట్ షాక్ తగలడం వల్ల లేదా మరే ఇతర కారణాల వల్ల అయిన మరణించి ఉండవచ్చు. ఈ వ్యక్తి బూడిద రంగు ప్యాంట్ మీద తెలుపు రంగు డాట్స్‌తో కూడిన ప్యాంట్, నీలం రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. విద్యుత్ షాక్ వల్ల శరీరం నల్లబడి పోయింది. గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు సూచనలతో ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్ల లో తెలియజేయాలని కోరారు.

'కార్మికులను మభ్యపెడుతున్న గుర్తింపు సంఘం'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గాన్ని గుర్తింపు సంఘం, యాజమాన్యాలు మభ్యపెడుతున్నాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో హామీలు ఇచ్చిన ఏఐటీయూసీ గెలిచిన తర్వాత ఇదిగో, అదిగో అంటు కాలయాపన చేస్తోందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో గుర్తింపు యూనియన్ పూర్తిగా విఫలమైందన్నారు. ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటివ్ ఇప్పించలేకపోతున్నారన్నారు. వేతన సవరణ, సిబ్బంది భర్తీ, ఇన్సెంటివ్ తదితర అంశాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, టీఎంకె నాయక్, గొందేశి ప్రభాకరరెడ్డి, సుదర్శనం, గోపాలరాజు, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా మురుగునీటి నిర్వహణ



ప్రసంగిస్తున్న ఐఐపీఈ సంచాలకులు ఆచార్య శాలివాహన్

ఏయూ క్యాంపస్: మురుగునీటిని సమర్థవంతంగా నిర్వహించడం, పునర్వినియోగంగా మార్చడం ఎంతో అవసరమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ అన్నారు. ఐఐపీఈ సమావేశ మందిరంలో 'వేస్ట్ వాటర్ క్యారక్టరైజేషన్, ట్రీట్‌మెంట్-రీయూజ్'అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం శాలివాహన్ మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ విధానాలు, ప్రాధాన్యతను వివరించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ టి.రాజేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మురుగునీటి లక్షణాలను శాస్త్రీయంగా తెలుసుకోవడం, శుద్ధి చేసే విధానాలు, పునర్వినియోగం చేయడం ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. నీటి వనరుల లభ్యత తగ్గుతూ, వినియోగం పెరుగుతున్న తరుణంలో మురుగునీటిని సైతం శుద్ధిచేసి ప్రత్యేక అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఐఐపీఈ ప్రయోగశాలను సందర్శించారు. మురుగనీటి పునర్వినియోగంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ ప్రతినిధి జి.ఫణికుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ రవికుమార్ సోన్వాని, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

మద్యం తాగిన వాహన చోదకులపై కేసులు, జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: గత పది రోజులుగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం తెల్లవారు వరకు జ్ఞానాపురం బ్రిడ్జి నుంచి కంచరపాలెం మెట్టు వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై కొరడా ఝుళిపించారు. ఈ పది రోజుల్లో 48 మందిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. అందులో 27 మందిని మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రూ.33 వేలు జరిమానా విధించినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ముందస్తు చర్యగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. గతంలో జరిమానాలు విధించి కట్టని వాహన చోదకుల నుంచి వసూలు చేశామన్నారు.